PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక 209 | పేజీలు : 8 | వెల రూ.5 | ఆదివారం 23.08.2026
ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh



WANTED REPORTERS

# అంతర్జాతీయ ప్రయాణికులకు కొత్త రూల్

## సెప్టెంబర్ 1 నుంచి బోర్డింగ్ పాస్‌పై స్టాంపింగ్‌కు స్వస్తి




ఢిల్లీ – ప్రభాత సూర్యుడు: అంతర్జాతీయ విమాన ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం కీలక మార్పు తీసుకొచ్చింది. సెప్టెంబర్ 1, 2026 నుంచి దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ సమయంలో ఫిజికల్ బోర్డింగ్ పాస్‌ను తప్పనిసరిగా సమర్పించి దానిపై స్టాంప్ వేయించుకోవాల్సిన నిబంధనను తొలగించనున్నారు. బదులుగా ప్రయాణికులు తమ ఈ–బోర్డింగ్ పాస్‌ను ఇమ్మిగ్రేషన్ కౌంటర్ వద్ద చూపించవచ్చు. బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ తీసుకున్న ఈ నిర్ణయం సెప్టెంబర్ 1 నుంచి దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో అమల్లోకి రానుంది. ఇప్పటికే ప్రింటెడ్ బోర్డింగ్ పాస్‌తో వచ్చే ప్రయాణికులు దానిని ఉపయోగించుకోవచ్చు. అయితే ఇకపై దానిపై ఇమ్మిగ్రేషన్ స్టాంప్ వేయడం తప్పనిసరి కాదు. ప్రయాణికులకు ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేయడం, అనవసరమైన ఆలస్యాలను తగ్గించడం, బోర్డింగ్ పాస్‌లపై తప్పుగా లేదా సరిగా స్టాంపులు పడటం వల్ల ఏర్పడే సమస్యలను నివారించడం ఈ మార్పు ప్రధాన ఉద్దేశంగా అధికారులు పేర్కొన్నారు. దీంతో విదేశాలకు వెళ్లే ప్రయాణికులకు విమానాశ్రయంలో మరో అడుగు తగ్గనుంది. డిజిటల్ విధానంలో ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసే చర్యల్లో భాగంగా ఈ మార్పు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.

# కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ జోడీ..

## హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా అడుగులు

## కేంబ్రిడ్జ్ యూనివర్సిటీతో తెలంగాణ భాగస్వామ్యంపై చర్చలు



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు: తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ విద్యావేత్తల బృందంతో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ఫలప్రదమైన సమావేశం నిర్వహించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ చర్చల్లో హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దే అంశంపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొన్నారు. హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి విద్యా సంస్థలకు ఉన్న అవకాశాలను వివరించిన ముఖ్యమంత్రి, తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాల్లో భాగస్వాములు కావాలని కేంబ్రిడ్జ్ ప్రతినిధులను ఆహ్వానించారు. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్లు జైదీప్ ప్రభు, వెంకట సిరీష్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అవకాశాలపై సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలు, యువ పారిశ్రామికవేత్తల ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధికి సహకారం అందించే దిశగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఇరు వర్గాలు అంగీకరించాయి. కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ భాగస్వామ్యానికి ఈ చర్చలు కొత్త మార్గాన్ని చూపనున్నాయని, హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దే తెలంగాణ రైజింగ్ లక్ష్యానికి మరింత బలం చేకూర్చనున్నాయని ప్రతినిధులు తెలిపారు.

# ఇళ్లు కూల్చడం..భూములు లాక్కోవడమేనా మీరు తెచ్చిన మార్పు?

- రేవంత్ సర్కారుపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జూటూరు కీర్తిరెడ్డి తీవ్ర విమర్శలు



హైదరాబాద్, ఆగస్టు 22: 22ఏ నిషేధిత జాబితా పేరుతో రాష్ట్రంలో భారీ భూ కుంభకోణానికి ప్రభుత్వం తెరలేపిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జూటూరు కీర్తిరెడ్డి ఆరోపించారు. 22ఏ చుట్టూ ఇటీవల తలెత్తిన వివాదాలు, ప్రభుత్వం వెనక్కి తగ్గిన తీరుపై ఆమె విమర్శలు చేశారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని తన కార్యాలయం నుంచి ఆమె మీడియా ప్రకటన విడుదల చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రజలు కోరుకున్న మార్పు కనిపించడం లేదని, ఇళ్లు కూల్చడం, పేదలు, సామాన్యుల భూములను నిషేధిత జాబితాలో చేర్చడం వంటి చర్యలు జరుగుతున్నాయని కీర్తిరెడ్డి ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు భూముల వ్యవహారంలో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోందని విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లపై బుల్డోజర్లు ఎక్కించిన ప్రభుత్వం, ఇప్పుడు 22ఏ నిషేధిత జాబితా పేరుతో సామాన్యుల భూములను వివాదాస్పదంగా మారుస్తోందని ఆమె ఆరోపించారు. 22ఏ జాబితాలో తప్పులు చోటుచేసుకున్నాయని ప్రభుత్వం అంగీకరించిన నేపథ్యంలో, ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు మొత్తం వ్యవహారంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ వ్యవహారాల తరహాలోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తోందని కీర్తిరెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ అభివృద్ధి, ఫ్యూచర్ సిటీ, మూసీ సుందరీకరణ వంటి అంశాలను ప్రస్తావిస్తున్న ప్రభుత్వం, పేదల భూములను 22ఏ జాబితాలో ఎలా చేర్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 22ఏ వ్యవహారంలో తప్పులు జరిగాయని అంగీకరించి కేవలం అధికారులను బాధ్యులను చేయడం సరిపోదని, ప్రభుత్వ పెద్దలు కూడా బాధ్యత వహించాలని ఆమె అన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

### పేదల భూములు లాక్కుంటే ఊరుకోం

పేదలు, సామాన్యుల భూములను లాక్కోవాలని చూస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని కీర్తిరెడ్డి హెచ్చరించారు. ప్రజల ఆస్తులు, హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతామని తెలిపారు. తెలంగాణలో భవిష్యత్తులో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# చక్కెర ధరలకు రెక్కలు..

## కిలో రూ.55 దాటింది!

## ఇథనాల్ కారణం కాదంటున్న కేంద్రం..ఉత్పత్తి తగ్గుదల, డిమాండ్ పెరుగుదల, నిల్వలపై అనుమానాలు



న్యూఢిల్లీ: సామాన్యుడి వంటింటిపై మరోసారి ధరల భారం పడుతోంది. దేశవ్యాప్తంగా చక్కెర ధరలు ఇటీవల కాలంలో గణనీయంగా పెరిగాయి. నెల రోజుల వ్యవధిలోనే కిలో చక్కెర ధర దాదాపు రూ.10 వరకు పెరిగినట్లు అంచనాలు చెబుతున్నాయి. జూలై 20న దేశవ్యాప్తంగా చక్కెర సగటు రిటైల్ ధర కిలోకు రూ.48.18గా ఉండగా.. ప్రస్తుతం అది రూ.55.70కు చేరినట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. చక్కెర ధరల పెరుగుదలకు ఇథనాల్ ఉత్పత్తే ప్రధాన కారణమని సోషల్ మీడియాలో, కొన్ని వర్గాల్లో ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇచ్చింది. చక్కెర ధరలకు, ఇథనాల్ ఉత్పత్తికి నేరుగా సంబంధం లేదని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ శాఖ స్పష్టం చేసింది. చక్కెర ధరలు పెరగడానికి పలు కారణాలు ఉన్నాయని కేంద్రం పేర్కొంది. చక్కెర ఉత్పత్తి తగ్గడం, పండుగల సీజన్ నేపథ్యంలో డిమాండ్ పెరగడం, వాతావరణ పరిస్థితుల ప్రభావంతో చెరకు పంట దెబ్బతినడం వంటి అంశాలు ధరలపై ప్రభావం చూపుతున్నాయని తెలిపింది. అంతర్జాతీయంగా సరఫరా పరిస్థితులు కూడా కఠినంగా మారడం దేశీయ మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నట్లు పేర్కొంది. అయితే మార్కెట్‌లో చక్కెర లభ్యతకు సంబంధించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్రం చెబుతోంది. దేశీయ వినియోగానికి సరిపడా చక్కెర నిల్వలు ఉన్నాయని స్పష్టం చేసింది.

### నిల్వదాచడంపై కేంద్రం నజర్

ఇదిలా ఉండగా.. చక్కెర ధరల పెరుగుదలపై కేంద్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరిస్తోంది. చక్కెరను అధికంగా నిల్వ ఉంచడం, ఊహాజనిత లావాదేవీల ద్వారా మార్కెట్‌లో కృత్రిమ కొరత ఉన్నట్లుగా భావన కల్పించడం వంటి చర్యలు ధరల పెరుగుదలకు దోహదం చేస్తున్నాయని కేంద్రం గుర్తించింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా చక్కెర డీలర్లపై ఆగస్టు 1 నుంచి నవంబర్ 30 వరకు నిల్వ పరిమితులను విధించింది. డీలర్లు తమ వద్ద ఉన్న చక్కెర నిల్వలను ప్రకటించడంతో పాటు ప్రతి వారం వాటి వివరాలను ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

### ఇథనాల్‌పై కేంద్రం వివరణ

చెరకు రసం, మొలాసిస్ వంటి ముడి పదార్థాలతో ఇథనాల్ తయారవుతున్నప్పటికీ.. ప్రస్తుతం చక్కెర ధరల పెరుగుదలను మొత్తం ఇథనాల్ ఉత్పత్తికి ఆపాదించడం సరైంది కాదని కేంద్రం చెబుతోంది. ఇథనాల్ మిశ్రమ కార్యక్రమంపై వస్తున్న పలు అపోహలను కూడా కేంద్రం గతంలో ఖండించింది. ఇంధనంగా ఉపయోగించే ఇథనాల్ తయారీ ప్రక్రియలో చక్కెరలు తొలగిపోతాయని, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

